క్లుప్తంగా

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు



మరిడమ్మ తల్లికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మరిడమ్మ అమ్మవారికి గురువారం మఖ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో అడుగుభాగం పాడైన విద్యుత్ స్తంభం

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డులో విద్యుత్ స్తంభం ప్రమాదభరితంగా ఉన్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. పెద్దాపురం నుంచి సామర్లకోట వచ్చే రోడ్డులో ఇనుప విద్యుత్తు స్తంభం సుమారు ఆరు నెలల ఉంచి వంకర తిరిగిపోయి, తుప్పు పట్టి ఎప్పుడైనా కూలిపోయే స్థితిలో ఉంది. ఇటీవల తుపాన్‌కు ఒరిగిపోయిందని, దానిని అధికారులు తాత్కాలికంగా నిలిపి వదిలేశారు. స్తంభం కింది భాగంలో తుప్పు పట్టి రంధ్రం పడడంతో బలమైన గాలి వీస్తే పడిపోయేలా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే ఆ రోడ్డులో 11 కేవీ విద్యుత్ వైర్లు ఉన్న ఈ స్తంభం కూలితే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. ఆ స్తంభాన్ని మార్చి కొత్త స్తంభాన్ని వేయాలని కోరుతున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఈఈ ప్రభాకర్‌ను వివరణ కొరగా తమ సిబ్బందిని పంపి పరిశీలించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

గొల్లప్రోలు: డెంగీపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గొల్లప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.సుబ్బారావు అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం గొల్లప్రోలు, చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రజలకు డెంగీ, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ డెంగీవ్యాధి రాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇళ్ల వద్ద మురికినీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామం వద్ద గల కాకినాడ కేంద్రీయ విద్యాలయలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రిన్సిపాల్ బి.శేఖర్, సిబ్బంది గురువారం అభినందించారు. ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాలలో ఇక్కడి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 35 మంది పరీక్ష రాసి మొత్తం విజయం సాధించారు. పి.వర్షిత 500 మార్కులకు గాను 487మార్కులు, కె.రూఫీనా సాగర్ 475 మార్కులు, సాధించారు. తల్లిదండ్రులు సమక్షంలో ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించి, భవిషత్‌లో ఉన్నత స్థితికి చేరుకునేలా ఉన్నత చదువులు కొనసాగించాలని కోరారు.

ఉపాధి నిలయాలు.. తాండ్ర బట్టీలు

- చేబ్రోలులో జోరుగా మామిడి తాండ్ర తయారీ
- ఉపాధి పొందుతున్న రెండు వేల మంది
- జిల్లాతో పాటు సుదూర ప్రాంతాలకు ఎగుమతి

గొల్లప్రోలు: వేసవి వచ్చిందంటే చాలు మధుర ఫలాలు మామిడి పండ్లు వచ్చేస్తాయి. చిన్నపిల్లల నుంచి పండు ముసలి వరకూ మామిడి పండ్లను ఎంతో ఇష్టంగా తింటారు. ఏటా మార్చి నుంచి జూన్ చివరి వరకూ మామిడి పండ్లు లభిస్తాయి. ఈ సమయంలో చాలా మంది మామిడి తాండ్రను తయారు చేసి ఏడాది మొత్తం విక్రయించడం ద్వారా ఆదాయం పొందుతారు. కాగా మామిడి తాండ్ర బట్టీలు గొల్లప్రోలు మండలంలో ఎక్కువగా ఉన్నాయి. వీటిపై ఆధారపడి ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు.

చేబ్రోలులో..

గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు గ్రామం మామిడి తాండ్ర తయారీకి పెట్టింది పేరు. మండలంలోని చేబ్రోలు, చెందుర్తి, కొడవలి గ్రామాల్లో మామిడి తోటలు ఎక్కువ. ఈ గ్రామాలతో పాటు శంఖవరం, రౌతులపూడి, ప్రత్తిపాడు, తుని, తొండంగి మండలాల నుంచి మామిడి కాయలను చేబ్రోలు గ్రామంలోని మామిడి తాండ్ర తయారీ కేంద్రాలకు దిగుమతి చేసుకుంటారు. ప్రస్తుతం మామిడి కాయల సీజన్ కావడంతో తాండ్ర తయారీ కేంద్రాలు తెరుచుకున్నాయి. చేబ్రోలులో నాలుగు తాండ్ర బట్టీలు ఉన్నాయి. మామిడి తోటల్లోనే యంత్ర సామగ్రి ఏర్పాటు చేసి తాండ్రను తయారు చేస్తున్నారు.

మూడు నెలల పాటు ఉపాధి

తాండ్ర తయారు చేయడానికి ఇక్కో బట్టీలో సుమారు 160 నుంచి 200 మంది వరకూ కూలీలు నిత్యం పని చేస్తుంటారు. మామిడి గుజ్జు, బెల్లం పాకం తయారీకి మగవారు 30 మంది, చాపలపై పోత పోసేందుకు మహిళలు 80 మంది వరకూ పని చేస్తుంటారు. తాండ్ర తయారీ ద్వారా సుమారు రెండు వేల మందికి పైగా ఉపాధి లభిస్తోంది. ఒక్కో మహిళకు రోజు కూలి రూ.300 నుంచి రూ.350, మగవారికి రూ.400 నుంచి రూ.500 వరకూ ఇస్తారు. ఏటా వేసవిలో మూడు నెలల పాటు కూలీలు ఉపాధి పొందుతారు.

తాండ్ర తయారీ ఇలా..

మామిడి కాయలను కోసి శుభ్రం చేస్తారు. తర్వాత టెంకను వేరు చేసి ముక్కలను పలుపు యంత్రంలో వేసి గుజ్జును తీస్తారు. ఈ విధంగా వచ్చిన గుజ్జును పాకంగా మార్చి బెల్లం కలుపుతారు. దానిని ఎండలో బట్టీ చాపలపై కూలీలు పొరలుగా పోస్తారు. టన్ను మామిడి కాయలకు సమారు మూడు క్వింటాళ్ల బెల్లం వినియోగిస్తారు. రోజుకు సుమారు 13 క్వింటాళ్ల బెల్లం ఉపయోగించి సగటున టన్నున్నర నుంచి రెండు టన్నుల వరకూ మామిడి తాండ్ర తయారు చేస్తారు.



చేబ్రోలు చాపలపై తాండ్ర పోత పోస్తున్న కూలీలు



మామిడికాయలను శుభ్రం చేస్తున్న కూలీలు

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

ఇటీవల సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో తాండ్ర తయారీలో యంత్రాల వినియోగం పెరిగింది. దీంతో తాండ్ర ఉత్పత్తి పెరిగినప్పటికీ ఆశించిన స్థాయిలో డిమాండ్ ఉండటం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మామిడి తాండ్ర కిలో రూ.50 నుంచి రూ.55 మాత్రమే ఉండడంతో గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. కాగా చేబ్రోలులో తయారైన మామిడి తాండ్రను జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు ఒడిశా, నాగపూర్, ఢిల్లీ వంటి సుదూర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఉపాధి లభిస్తోంది



చేబ్రోలులోని మామిడి తాండ్ర తయారీ కేంద్రంలో రోజుకు 150 మందికి పైగా పని చేస్తున్నాం. వేసవిలో ఇతర పనులు ఉండకపోవడంతో ఈ పనికే వస్తాం. మామిడి తాండ్ర తయారీ ద్వారా మాకు ఉపాధి లభిస్తోంది.

కె.వరలక్ష్మి, కూలి, శంఖవరం మండలం

గిట్టుబాటు కావడం లేదు



ఖర్చులు పెరగడంతో మామిడి తాండ్ర తయారీ గిట్టుబాటు కావడం లేదు. పంచాదార, బెల్లంతో పాటు ఈ ఏడాది మామిడి కాయల ధరలు భారీగా పెరిగాయి. అదే రీతిలో తాండ్ర ధరలు పెరగకపోవడంతో గిట్టుబాటు కావడం లేదు. ఏటా ఇదే పని చేయడంతో లాభాలు లేకున్నా తాండ్ర బట్టీలు నిర్వహిస్తున్నాం.

జె.ప్రభాకర్, నిర్వాహకుడు, చేబ్రోలు

భారీ మెజార్టీతో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

- రాష్ట్రంలో 155 సీట్లతో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి
- కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో దవులూరి దొరబాబు



సామర్లకోటలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న దొరబాబు



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన కార్యకర్తలు, అభిమానులు

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ మెజార్టీతో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయనున్నట్టు వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు మున్సిపాలిటీలు, మండలాల పరిధిలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు తన విజయానికి ఎంతో కృషి చేశారని, అందరికీ కృతజ్ఞతలని ఆయన తెలిపారు. మహిళలు జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలుకు కృతజ్ఞతగా అర్ధరాత్రి దాటినా క్యూలో నిలబడి ఓట్లు వేశారని తెలిపారు. మహిళల ఓటు బ్యాంకుతో జగన్‌మోహన్‌రెడ్డి రెండో పర్యాయం 155 సీట్లతో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని అభిమానుల కేరింతల మధ్య దొరబాబు ప్రకటించారు. తన విజయం అందరిదీ అని తెలిపారు. స్థానికుని సత్తా చూపినందుకు ఎంతో ఆనందంగా ఉన్నదన్నారు. పార్టీ విజయం కోసం కష్ట పడిన ప్రతి ఒక్కరినీ గుర్తుంచుకుంటానని, ఆయా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పోలింగ్ అయిన తరువాత ప్రతి రోజు అనేక మంది తన ఇంటికి రావడం, ఆ సమయంలో నేను లేక పోవడంతో కార్యకర్తలు, అభిమానులు నిరాశకు గురి కావడంతో వారి కోరిక మేరకు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించి ఆదర్శ నియోజకవర్గంగా తయారు చేయడానికి ప్రణాళిక తయారు చేసినట్టు తెలిపారు. నా విజయం కోసం తన భార్య చంద్రకళ ఎంతో కష్టపడిందని ఆమెను ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం అనంతరం కార్యకర్తలతో మరో పర్యాయం సమావేశమవుతానని దొరబాబు తెలిపారు. దవులూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా దొరబాబు మంచి జంటగా మంచి మెజార్టీ ఇవ్వడానికి ఓటర్లు సిద్ధమైనందున ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. దొరబాబు సతీమణి చంద్రకళ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు మహిళలు చూపిన ఆదరణ ఎన్నటికీ మరచిపోలేనని అన్నారు. ఈ సందర్భంగా అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొరబాబు కుమార్తె సార్విక, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, మాదిగ ఐక్యవేదిక జిల్లా నాయకులు కాళ్ల లక్ష్మీనారాయణ, జనార్దన్, నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణంతో ఊరట

సామర్లకోట: వేసవి కాలంలో మే నెల ప్రారంభం నుంచి ఎండలు మండి పావడంతో ప్రజలు అల్లాడిపోయారు. ఎన్నికల వేడిలో ఎండలపై దృష్టి పెట్టని జనం పోలింగ్ పూర్తి అయిన రోజు నుంచి ఎండలకు హడలిపోతూ వచ్చారు. బంగాళాఖాతంలో అల్ప పీడనంతో గురువారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పు వచ్చి అడపాదడపా చినుకులు పడుతూ ఉండటంతో వేడి తగ్గి ప్రజలు ఊరట చెందుతున్నారు. వేసవిలో ప్రజలను బెంబేలు ఎత్తించే రోహిణి రాక ముందే నైరుతి రుతుపవనాలు వస్తున్నాయనే వార్తలతో ప్రజలు ఆనంద పడుతున్నారు. అయితే రోహిణికి ముందు చిన్న చిన్న చినుకులు పడితే రోహిణిలో ఎండలు మండిపోతాయని పెద్దలు చెప్తున్నారు. మరి రుతుపవనాలు ఎప్పుడు వస్తాయో వేచి చూడాలి.

పారా లీగల్ వలంటీర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాజమహేంద్రవరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల ప్రకారం మండల న్యాయాధికారుల కమిటీ ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్లు ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి తెలిపారు. పిఠాపురంలో పారా లీగల్ వలంటీర్లుగా ఏడాది పాటు పని చేసేందుకు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలకు చెందిన వారి నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. మెట్రిక్యులేషన్ విద్యార్హత కలిగి 18 ఏళ్లు నిండినవారు పారా లీగల్ వలంటీర్ పోస్టులకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను వచ్చే నెల 20వ తేదీ లోపు మండల న్యాయాధికారుల కమిటీకి అందజేయాలని సూచించారు.

కాకినాడ మండలంలో...

కాకినాడ లీగల్: జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా న్యాయ సహాయం అందించడానికి మండల న్యాయసేవాధికార సంస్థలో పారాలీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల న్యాయసేవాధికార సంస్థ పరిధిలో 25 మందిని ఎంపిక చేస్తామని, వారికి ఏడాది కాలం సేవలు అందించాలన్నారు. దరఖాస్తుదారు విద్యార్హత పదో తరగతి, దానితో సరి సమానమైన అర్హత ఉండాలి, వయో పరిమితి 18 ఏళ్లు నిండి ఉండా లి. మౌఖిక ఇంటర్వ్యూను ఎదుర్కొనవలసి ఉంటుంది.

విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ



ఏలేశ్వరం గ్రంథాలయంలో చిత్ర లేఖనంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఏలేశ్వరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. శిబిరాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడి రాము విద్యార్థులకు చిత్రలేఖనంపై మెళకువలు నేర్పారు. అలాగే మజ్జి నాగేశ్వరరావు గణితంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తునట్టు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కోటనందూరు: విద్యార్థులను అన్ని రంగాల్లో ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ నాగరత్నం తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ నాగలక్ష్మి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు తప్పుదోవ పట్టకుండా వారి విజ్ఞానాన్ని పెంపొందించడమే వేసవి శిబిరాల లక్ష్యమన్నారు. విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, బొమ్మల తయారీ, ఆటపాటల్లో తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు పోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు, గోవింద మాలధారులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఏడు గంటలకు అర్చకులు ఉత్సవాల ఆరంభ స్నపనం (క్షీరాభిషేకం) నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తొలుత కలశాలతో ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. విశ్వక్షేన ఆరాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, వైనతేయ ప్రతిష్ఠ, పల్లకీ సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాత సంచుల వర్తక సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 వరకూ నిర్వహిస్తున్నారు.

నేడు ప్రత్యేక పూజలు

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ధ్వజారోహణ, గరుడ ప్రసాద వితరణ, యాగశాల ప్రవేశం, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, భేరిపూజ, దేవతాహ్వానం, వాహనసేవ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

చెత్తపై చిత్త శుద్ధి ఏదీ?

- మూలకు చేరిన తడి, పొడి చెత్త వాహనాలు
- పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంతో పేరుకుపోతున్న చెత్త



నీలమ్మ చెరువుగట్టుపై పెరిగిపోయిన చెత్త



నిరుపయోగంగా ఉన్న మినీ పారిశుధ్య వాహనాలు

సామర్లకోట: చెత్త నిర్వహణలో పారిశుధ్య సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 45 మంది శాశ్వత, 99 మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నప్పటికీ ఎక్కడి చెత్త అక్కడే తాండవిస్తోంది. వీరి పనుల పర్యవేక్షణకు ప్రతి సచివాలయంలో ఒక శానిటరీ కార్యదర్శి ఉన్నప్పటికీ ఏం ఉపయోగం లేదు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా మున్సిపాలిటీకి తడి, పొడిచెత్త సేకరించడానికి 9 మినీ పారిశుధ్య వాహనాలు ఉన్నప్పటికీ నిర్వహణ లోపం వల్ల అవి మూలకు చేరాయి. చిన్నపాటి సాంకేతిక లోపాలను సరిచేయకపోవడంతో ఆ వాహనాలను స్క్రాప్‌గా జమచేస్తున్నారు. చిన్న సందుల్లో చెత్త సేకరణకు అత్యంత ఉపయోగంగా, సైరన్ మోగిస్తూ వచ్చే ఈ వాహనాలకు ఆదరణ ఉండేది. కానీ వాటిని ప్రారంభించిన నెల రోజులకే దాని వాడకం తెలియక మూలకు చేర్చేశారు.

తోపుడు బళ్లతో చెత్త సేకరణ....

పట్టణ పరిధిలో ఆయా వార్డులలో తోపుడు బళ్లతోనే చెత్త సేకరించి పలు కూడళ్లలోనే వదిలేస్తున్నారని స్వయంగా అధికారులే అంటున్నారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను సచివాలయ శానిటరీ కార్యదర్శులు ట్రాక్టర్లకు అందజేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. పారిశుద్ధ్య ట్రాక్టర్లు స్టేషన్ సెంటర్‌లోని హోటళ్ల నుంచి చెత్త సేకరించడానికి ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మినీ వాహనాలను అందుబాటులోకి తీసుకురావాలి..

సుమారు పదేళ్ల క్రితం వచ్చిన స్వీపింగ్ వాహనాన్ని నేటికీ ఉపయోగించడం లేదు. వాటికి మరమ్మతులు చేయించి వినియోగించాలి. వాటికున్న వారెంటీ కాలంలోనే అధికారులు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలి.

– కాళ్ల లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్, సామర్లకోట

కలెక్టరు దృష్టికి తీసుకువెళ్తాం..

మినీ పారిశుధ్య వాహనాల మరమ్మతులపై సదరు సంస్థకు ఫిర్యాదు చేశాం. కానీ ఆ సంస్థ అధికారులు స్పందించలేదు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వాహనాలను మరమ్మతు చేయిస్తాం. ప్రతి వాహనానికి ఒక డ్రైవరును నియమిస్తాం.

– జె.రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

'పిఠాపురం' ఈవీఎంలకు పటిష్ట భద్రత

- స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతర నిఘా
- జేసీ రామసుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికలకు సంబంధించి పిఠాపురం నియోజకవర్గానికి చెందిన స్ట్రాంగ్ రూమ్‌ను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్, పిఠాపురం రిటర్నింగ్ అధికారి ఎస్ రామ్‌సుందర్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం నియోజకవర్గం ఈవీఎంల స్ట్రాంగ్ రూమును, నిఘా వ్యవస్థను ఆయన పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో గత 13వ తేదీన పోలింగ్ ప్రక్రియ అంతా సజావుగా జరిగిందన్నారు. పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలను ఇక్కడ భద్రపవచడం జరిగిందన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతరం పరిశీలించే విధంగా సీసీ కెమెరాలు అన్ని వైపులా కనిపించేలా ఏర్పాటు చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర బలగాలతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు జేసీ తెలిపారు.



పిఠాపురం నియోజకవర్గం ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూమును, నిఘా వ్యవస్థను పరిశీలిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

మళ్లీ అధికారం వైఎస్సార్ సీపీదే

కాకినాడ: వచ్చేనెల 4వ తేదీన వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ మరోసారి విజయదుందుభి మోగించనుందని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ప్రమాణస్వీకారం చేస్తారని కేడర్ హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. స్థానిక డి కన్వెన్షన్‌లో గురువారం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ఇన్‌చార్జిలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో గడచిన నెల రోజులుగా అవిశ్రాంతంగా శ్రమించి పార్టీ విజయానికి పాటుపడ్డ ప్రతి ఒక్కరికి ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా తనకు అత్యంత సన్నిహితులైన మిత్రులు, బంధువులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించి ఆయా డివిజన్లలో పార్టీ విజయం కోసం తపనతో చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఓటమి భయంతో తెలుగుదేశం నేతలు పలుచోట్ల కవ్వింపు చర్యలకు పాల్పడినప్పటికీ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం కోల్పోకుండా పనిచేశారని ప్రశంసించారు. ఇతర జిల్లాల నుంచి అరాచక శక్తులను రప్పించి వైఎస్సార్ సీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి విధ్వంసం చేయడం ద్వారా పోలింగ్‌కు అవాంతరాలు కల్పించాలని టీడీపీ, జనసేన శతవిధాలుగా ప్రయత్నించిందని పేర్కొన్నారు. ఆ కూటమి నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు ప్రజలు కూడా వాస్తవాలను గ్రహించి పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఓటింగ్ సరళిని బట్టి 15 వేలకు పైగా మెజార్టీ వస్తుందన్న అంచనాతో ఉన్నామని ద్వారంపూడి ప్రకటించారు. అదే సమయంలో మెజార్టీ స్థానాల్లో విజయం సాధించడం ద్వారా జగన్ రెండోసారి సీఎం కానున్నారని కార్యకర్తలు హర్షధ్వానాలు, కేరింతలు మధ్య ప్రకటించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీని విజయపథాన నడిపించనున్నాయని పేర్కొన్నారు. కష్టించి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, రాష్ట్ర ప్రచారకమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, వివిధ డివిజన్ల మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.